సాక్షి పెద్దపల్లి

గురువారం : 29 : ఫిబ్రవరి : 2024

మధుర 'జ్ఞాపకం-29'

భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365 రోజుల 5 గంటల 49 నిమిషాల 12 సెకండ్లు పడుతుంది. అంటే 365 రోజులతో పాటు మరోపావు రోజు అవుతుందన్నమాట. పావు రోజును లెక్కలోకి తీసుకోలేం కాబట్టి.. నాలుగేళ్లలో నాలుగు పావురోజుల్ని కలిపితే ఒక రోజు అవుతుంది. ఆ ఏడాదినే లీప్ ఇయర్‌గా పిలుస్తాం. ఈ ప్రక్రియ అంతా ఫిబ్రవరి నెలలో పూర్తవుతుంది. అంటే ఆ నెలలో 28కి బదులు 29 రోజులు వస్తాయి. ప్రతీ నాలుగేళ్లకోసారి వచ్చే ఈ సంవత్సరం ఫిబ్రవరిలో 29 రోజులుంటాయి. ఈరోజు పుట్టిన వారిని లీప్లింగ్స్ లేదా లీపర్స్ అని పిలుస్తారు. ఇదేరోజు పుట్టినవారు, పెళ్లి చేసుకున్న వారు బర్త్‌డే.. వెడ్డింగ్ యానివర్సరీ జరుపుకునేందుకు నాలుగేళ్లు ఎదురు చూస్తారు. గురువారం లీప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.. పలువురి అభిప్రాయాలు...

-8లో..



న్యూస్‌రీల్

9న లోక్ అదాలత్



మాట్లాడుతున్న సబ్ జడ్జి భారతి

మంథని: వచ్చేనెల 9న నిర్వహించే లోక్ అదాలత్‌పై బుధవారం స్థానిక కోర్టులో సబ్ జడ్జి భారతి, జూనియర్ సివిల్ జడ్జి గణేశ్ న్యాయవాదులతో సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సూచించారు.

మంచి ఫలితాలు సాధించాలి



ప్రాజెక్టులు పరిశీలిస్తున్న ముజమ్మిల్‌ఖాన్

సుల్తానాబాద్‌రూరల్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. భూపతిపూర్ కాస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను కలెక్టర్ పరిశీలించారు. టెన్త్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ప్రత్యేకాధికారి స్వరూప, ప్రిన్సిపాల్ స్వప్న ఉన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మేరాజ్ మహమ్మద్

జ్యోతినగర్(రామగుండం): పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి, పదో తరగతి పరీక్షల పర్యవేక్షణ ప్రత్యేకాధికారి మహమ్మద్ మేరాజ్ మహమూద్ సూచించారు. ఎన్టీపీసీలోని మైనారిటీ గురుకుల పాఠశాలను ఆయన బుధవారం సందర్శించి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని, ఒత్తిడికి గురికావద్దని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సూపరింటెండెంట్ ఫర్హానాజ్, సయ్యద్, అఖిల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థిని ప్రతిభ



బాలికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రామగుండం: అంతర్గాం మండలం ఎల్లంపల్లి కస్తూరిబాగాంధీ బాలిక విద్యాలయం విద్యార్థిని పెరుక అక్షర ఆంగ్లభాష స్పెల్ విజార్డ్ రాత పరీక్షలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి కల్పన బుధవారం తెలిపారు. హైదరాబాద్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంగ్లభాష స్పెల్ విజార్డ్ రాత పరీక్ష నిర్వహించారని పేర్కొన్నారు. గైడ్ టీచర్ లత ఆధ్వర్యంలో అక్షరకు ప్రైజ్‌మనీ అందజేసి అభినందించారు.

నేడు సింగరేణి సీఎండీ రాక



ఏపీఏ బొగ్గు గని

రామగిరి(మంథని): సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ గురువారం ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలో పర్యటించనున్నారు. ఏపీఏలో 3వ సీమ్ పంచ్ ఎంట్రీలు, ఆర్జీ-3 పరిధి ఓసీపీ-2లో కోల్ సైజర్స్‌ను ఆయన ప్రారంభించనున్నారు. దేశంలోనే అతిపెద్ద అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును అక్టోబర్ 2015లో రూ.1,250 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. తొలుత 4వ సీమ్‌లో ప్యానెల్స్ ఉండగా రెండు ప్యానెల్స్‌లో బొగ్గు తొలిగించి మూసివేశారు. 3వ ప్యానెల్‌లో వచ్చే మే నాటికి బొగ్గు నిల్వలు అయిపోతాయి. 4వ ప్యానెల్ జనవరి 2025లో ప్రారంభించి 2027వ సంవత్సరం వరకు నడిపిస్తారు. గని భవిష్యత్ దృష్ట్యా 3వ సీమ్ అభివృద్ధిపై దృష్టి సారించారు.

పత్తి ధర రూ.7,444

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి క్వింటాలుకు గరిష్ట ధర రూ.7,444 పలికింది. కనిష్ట ధర రూ.6,012గా నమోదైంది. సరాసరి ధర రూ.7,155 పలికిందని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి పృథ్వీరాజ్ దేవరాజ్ తెలిపారు.

'ఎల్‌ఆర్‌ఎస్'కు మోక్షం

- క్రమబద్ధీకరణ ప్రక్రియకు అడుగులు
- మూడున్నరేళ్ల నిరీక్షణకు తెర
- నిర్ణీత రుసుం చెల్లిస్తేనే రెగ్యులరైజేషన్



పెద్దపల్లిలోని ఓ ప్లాట్

సాక్షి, పెద్దపల్లి: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. దరఖాస్తులను సత్వరమే పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. దీంతో క్రమబద్ధీకరణ కోసం నిరీక్షిస్తున్న వారికి ఊరట లభించినట్లయ్యింది. అక్రమ లే అవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణతో స్థానిక సంస్థలకు ఆదాయం, విక్రయదారులకు ఊరట లభిస్తుందని భావించి ఎల్‌ఆర్‌ఎస్ రెగ్యులరైజేషన్‌కు సర్కారు గతంలో దరఖాస్తులు స్వీకరించింది. 2020లో ఆన్‌లైన్ ద్వారా రూ.1,000 ఫీజు చెల్లించి యజమానులు దరఖాస్తు చేసుకున్నారు. వీటిద్వారా సర్కార్ ఖజానాకు భారీగానే ఆదాయం సమకూరింది. కానీ, లే అవుట్‌లను పరిశీలించకపోవడంతో స్థానిక సంస్థలకు 33శాతం జరిమానా రూపేణా ఆదాయం రాలేదు. అంతేకాదు.. సుమారు మూడున్నరేళ్లుగా దరఖాస్తుదారులకు నిరీక్షణ తప్పలేదు.

తొలిదశ ప్రారంభమైనా..

గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన కోసం జీవో నంబరు 131 విడుదల చేసింది. నిబంధనల మేరకు ఉన్న స్థలాలను రెగ్యులరైజ్ చేయడానికి మార్గదర్శకాలు విడుదల చేసింది. మున్సిపల్ కమిషనర్లకు ప్రత్యేక లాగిన్ ఇచ్చింది. తొలిదశ ప్రక్రియ ప్రారంభమైనా.. సిబ్బంది కొరత తదితర కారణాలతో నత్తనడకన కొనసాగింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పరిష్కారం కోసం పూనుకోవడంతో స్థానిక సంస్థలకు ఆదాయంతోపాటు, దరఖాస్తుదారుల ఎదురుచూపులకు పరిష్కారం లభించనుంది. దీంతో అటెక్కిన రికార్డులను అధికారులు దుమ్ము దులుపుతున్నారు.

అనుమతులు ఇలా..

- వచ్చే మార్చి 31లోగా దరఖాస్తులు పరిశీలించి ఆమోదం కాగానే ఫీజు చెల్లిస్తే ప్రొసీడింగ్స్ ఇస్తారు.
- ఇందుకోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగుతాయి.
- అయితే, కొత్తగా మార్గదర్శకాలు విడుదల చేస్తారా, పాత నిబంధనలే అమలు చేస్తారా? అనేది తేలాల్సింది.
- మార్కెట్ విలువ ప్రకారం ప్లాట్‌కు ఫీజు నిర్ణయిస్తారు.
- అనధికార లే అవుట్లలో రిజిష్టర్ సేల్‌డీడ్ ద్వారా కొనుగోలు చేసిన ప్లాట్లకు అనుమతి ఇస్తారు.
- అయితే, వాటికి కనీసం 10 శాతం ప్లాట్ల రిజిష్టర్ సేల్‌డీడ్ ద్వారా విక్రయించిన అనధికార లే అవుట్‌లు, సేల్‌డీడ్ లేదా టైటిల్‌డీడ్ తప్పనిసరిగా ఉండాలి.
- అసైన్ భూముల్లో ప్లాట్లు, లే అవుట్‌లు ఉంటే కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
- నిషేధిత జాబితాలోని భూములను ప్లాట్లుగా మార్చితే తిరస్కరిస్తారు.
- భూ గరిష్ట పరిమితి చట్టానికి భిన్నంగా ఉన్నవి, సరిహద్దులు మొదలైన వివాదాలు ఉంటే అనుమతి నిరాకరిస్తారు.
- జీవో నంబరు 111లో నిర్దేశించిన చెరువులు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నవి, నాలాకు రెండు మీటర్ల లోపు ఉన్నవాటికి అనుమతి ఇవ్వరు.
- అక్రమ ప్లాట్ల క్రమబద్ధీకరణను రెండు దశల్లో పూర్తిచేస్తారు.
- తొలుత దరఖాస్తులను మున్సిపాలిటీ, పంచాయతీల వారీగా విభజిస్తారు.
- తర్వాత గ్రామ సర్వే నంబర్, కాలనీ, వార్డుల వారీగా విభజిస్తారు.
- రెండోదశలో అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాలు పరిశీలిస్తారు.
- అనంతరం కలెక్టర్ అనుమతితో ఆమోదిస్తారు.

19,178 పైగా దరఖాస్తులు

జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు, రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో 19,178 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించడానికి గతంలో సర్వే నంబర్లు, స్థల విస్తీర్ణం ప్రకారం క్లస్టర్లుగా విభజించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులతో బృందాలు ఏర్పాటు చేశారు. దరఖాస్తుల్లో పేర్కొన్న స్థలాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించి బఫర్‌జోన్, గ్రీన్‌జోన్, కమర్షియల్ జోన్‌లో లేదని నిర్ధారించుకుంటారు. అనంతరం స్థలం విలువ ఆధారంగా పెనాల్టీ వసూలు చేస్తారు.

నిబంధనల మేరకు అనుమతి

2020కి సంబంధించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులనే పరిశీలిస్తాం. పరిశీలించని వాటి యజమానులకు మరోసారి సమాచారం అందిస్తాం. కోర్టు వివాదాలు, దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు మినహా ఇతర లే అవుట్లను నిబంధనల మేరకు పరిష్కరిస్తాం.

– శ్రీధర్, డీటీసీపీవో

దరఖాస్తుల సమాచారం

మొత్తం దరఖాస్తులు	19,178
పరిశీలించినవి	5,929
తిరస్కరించినవి	185
ఫీజు చెల్లించేందుకు అనుమతించినవి	3,212
ఫీజు చెల్లించి ప్రొసీడింగ్స్ పొందినవి	33
ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం(రూ.లలో)	27,70,331

పెద్దపల్లిలో 'ఆపరేషన్ గరుడ'

- అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తాం
- ఫిర్యాదులకు న్యాయం చేయాలి
- రామగుండం సీపీ శ్రీనివాస్



సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంతోపాటు శివారులోనూ అసాంఘిక శక్తుల ఆటకట్టించేందుకు 'ఆపరేషన్ గరుడ' పేరిట సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచుతామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌తోపాటు ఠాణా ఆవరణలోని ఏసీపీ, సీఐ కార్యాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, రిసెప్షన్ సెంటర్, కమాండ్ కంట్రోల్ రూం, సీసీ కెమెరాలను పరిశీలించారు. నేర కార్యకలాపాలపై సీఐ కృష్ణ, ఎస్సైలు సుధాకర్ రావు, మల్లేశ్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఠాణా ఆవరణలో కలియ తిరిగిన సీపీ..

పోలీస్‌స్టేషన్ ఆవరణను సీపీ శ్రీనివాస్ కలియ తిరిగారు. రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే బాధితులకు అందించే సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలపై సత్వరమే స్పందించి న్యాయం జరిగేలా అధికారులు వ్యవహరిస్తే పోలీసులపై మరింత నమ్మకం పెరుగుతుందని అన్నారు. బ్లూకోల్ట్స్ టీంలు నిరంతరం పనిచేస్తాయని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని పోలీసు కమిషనర్ ఆదేశించారు.

అసాంఘిక శక్తుల ఆట కట్టడికి..

ఠాణా ఆవరణలోని కమాండ్ కంట్రోల్‌రూం పరిశీలించిన సీపీ శ్రీనివాస్.. సీసీ కెమెరా ఒక వైపు మాత్రమే చూపుతోందని, దానికి వ్యతిరేకంగా మరో సీసీ కెమెరా ఉంటే పూర్తిసమాచారం కనిపిస్తుందన్నారు. మత్తు పదార్థాలను విక్రయించే వారితోపాటు అసాంఘిక శక్తుల ఆటకట్టించేందుకు ఆపరేషన్ గరుడ పేరుతో డ్రోన్ కెమెరాలు వినియోగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డ్రోన్ పెట్రోలింగ్‌తో అందే సమాచారాన్ని బట్టి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పెద్దపల్లిలో ఆపరేషన్ గరుడ విజయవంతమైతే రామగుండం కమిషనరేట్ వ్యాప్తంగా అమలు చేస్తామని సీపీ వెల్లడించారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్, సీఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్‌రావు, మల్లేశ్, సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో పలువురు సీఐల బదిలీ

కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలోని పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు(సీఐ) బదిలీ అయ్యారు. ఈ మేరకు మల్టీ జోన్-1లోని 65 మంది సీఐలను బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న సీఐలూ ఉన్నారు.

- రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న ఎ.ఇంద్రసేనారెడ్డిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.
- సీఐడీ విభాగంలో పనిచేస్తున్న జి.సుబ్బారెడ్డిని సుల్తానాబాద్ సర్కిల్‌కు బదిలీ చేశారు.
- నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్-2లో పనిచేస్తున్న జి.అజయ్‌బాబును రామగుండం సర్కిల్‌కు బదిలీ చేశారు.
- వరంగల్‌కు సరేండర్ అయిన ఎ.వెంకటేశ్వర్లును మంథని సర్కిల్‌కు బదిలీ చేశారు.
- వెయింట్‌లో ఉన్న బి.రవీందర్‌ను గోదావరిఖని టూటౌన్‌కు బదిలీ చేశారు.
- సిద్దిపేట పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో కె.కృష్ణారెడ్డిని రామగుండం టాస్క్‌ఫోర్స్-1కు బదిలీ చేశారు.
- అలాగే రామగుండం ఐటీ విభాగంలో పనిచేస్తున్న సూరం వేణుగోపాల్‌ను జగిత్యాల పోలీస్ స్టేషన్‌కు, సుల్తానాబాద్‌లో పనిచేస్తున్న కె.జగదీశ్, రామగుండం సర్కిల్‌లో పనిచేస్తున్న టి.ప్రవీణ్‌కుమార్‌ను మల్టీజోన్-1 ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించారు.
- మంథని సర్కిల్‌లో పనిచేస్తున్న బొల్లెపల్లి రాజును రామగుండం సైబర్ క్రైం-2కు, ఇప్పటి వరకు సైబర్ క్రైం-2లో పనిచేసిన ఎంఎల్ఎం లింగయ్యను సైబర్ క్రైం-1కు బదిలీ చేశారు.
- గోదావరిఖని వన్‌టౌన్‌లో పనిచేస్తున్న ఎస్.ప్రమోద్‌రావును రామగుండం ఐటీ కోర్ విభాగానికి బదిలీ చేశారు.
- గోదావరిఖని టూటౌన్‌లో పనిచేస్తున్న ఎస్.ప్రసాదరావును రామగుండం లీగల్ సెల్ విభాగానికి బదిలీ చేశారు.

సుల్తానాబాద్ బల్దియా చైర్‌పర్సన్‌గా లక్ష్మి

- ఆ వెంటనే కాంగ్రెస్‌లో చేరిక



లక్ష్మికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గాజుల లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్డీవో మధుమోహన్ ఆధ్వర్యంలో బల్దియాలో బుధవారం నిర్వహించిన ఎన్నికల సమావేశానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు హాజరయ్యారు. చైర్‌పర్సన్ ముత్యం సునీత(బీఆర్‌ఎస్)పై ఈనెల 3వ తేదీన 12 మంది కౌన్సిలర్లు ప్రవేశ పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో చైర్‌పర్సన్ ఎన్నిక అనివార్యమైంది. మొత్తం 15 మంది కౌన్సిలర్లకు 12మంది హాజరయ్యారు. బీఆర్‌ఎస్‌కు చెందిన 2వ వార్డు కౌన్సిలర్ గాజుల లక్ష్మికి 11 మంది కౌన్సిలర్లు మద్దతు పలకడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో ప్రకటించారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మునిస్పల్ కమిషనర్ వేణుమాధవ్, వైస్ చైర్మన్ బిరుదు సమత, కౌన్సిలర్లు మమత, నిషాద్ రఫీక్, ప్రదీప్, సునీత, అరుణ, లక్ష్మి, తిరుపతి, రాజయ్య, గోపి, శ్రీనివాస్ పాల్గొన్నారు. కౌన్సిలర్ పారుపల్లి జ్ఞానేశ్వరి, మాజీ చైర్ పర్సన్ ముత్యం సునీత సమావేశానికి గైర్హాజరు కాగా, మరో సభ్యుడు సిద్ధ కనుకయ్య ఏడాది క్రితం మృతి చెందారు. కాగా, మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన గాజుల లక్ష్మి కొన్ని గంటల్లోనే పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. దీంతో బీఆర్‌ఎస్‌కు పెద్దషాక్ అని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం బల్దియాలో చర్చనీయాంశమైంది. ఆ తర్వాత కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, పార్టీలకతీతంగా బల్దియాను అభివృద్ధి చేయాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

మంథని సీడీపీవో సరెండర్

మంథని: మంథని ఐసీడీఎస్ కార్యాలయంలో అక్రమాలపై ఎట్టకేలకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. సీడీపీవో పద్మశ్రీ, రామగిరి క్లస్టర్ సూపర్‌వైజర్(ఇన్‌చార్జి సీడీపీవో) బండ రజితను రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ డైరెక్టర్‌కు సరెండర్ చేశారు. ఈమేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. గుంజపడుగు సెక్టార్ సూపర్‌వైజర్ గందు సరితకు షోకాజ్ నోటీస్ జారీచేశారు. సీడీపీవో పద్మశ్రీపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈనెల 22న డీడబ్ల్యూవో రవూఫ్‌ఖాన్, 26న వరంగల్ రీజినల్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి విచారణ జరిపారు. సీడీపీవోను సరెండర్ చేయడంతోపాటు తదుపరి చర్యలకు ఆదేశించారు. అలాగే ఇన్‌చార్జి సీడీపీవో, సూపర్‌వైజర్ విధులు సక్రమంగా నిర్వర్తించలేదని వారిపైనా చర్యలు తీసుకున్నారు.

రేపటి నుంచి గృహజ్యోతి అమలు

పెద్దపల్లిరూరల్: తెల్లరేషన్‌కార్డుదారులకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు జీరో బిల్లులు అందిస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ బొంకూరి సుదర్శన్ తెలిపారు. ప్రజాపాలనలో అందించిన వివరాలు సరిగ్గా లేక ఎవరికైనా జీరో బిల్లు రాకున్నా ఆందోళన పడొద్దన్నారు. వాటిని సవరించుకునేందుకు అవకాశమిస్తామని, అప్పటిదాకా బిల్లు చెల్లించాలని, ఈవిషయంలో తమ సిబ్బంది ఒత్తిడి చేయబోరని పేర్కొన్నారు. దరఖాస్తులో పొరపాటు దొర్లితే గ్రామీణ ప్రజలు ఎంపీడీవో కార్యాలయం, పట్టణ ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో తెల్లరేషన్‌కార్డు, అనుసంధానించిన ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారందరికీ 200 యూనిట్ల వరకు జీరోబిల్లు అందిస్తామని ఆయన వివరించారు.

మెడికల్ బోర్డులో అవినీతి అరికట్టేది ఎప్పుడు?

- సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: సింగరేణి మెడికల్ బోర్డులో జరిగే అవినీతిని అరికట్టేది ఎప్పుడని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ప్రశ్నించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ గద్దె దిగి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా, సింగరేణిలో గుర్తింపు యూనియన్ మారినా అవినీతి ఎందుకు తగ్గడం లేదన్నారు. 'తుంట పోయి.. మొద్దు ఎత్తుకున్న' చందంగా సింగరేణి కార్మికుల పరిస్థితి తయారైందని పేర్కొన్నారు. గ్రూప్ రాజకీయాలు మొదలుపెట్టి కార్మికులను దోచుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని ఆరోపించారు. మెడికల్ బోర్డులో జరిగే అవినీతి బహిరంగ రహస్యమే అయినా చర్యలు తీసుకోవడానికి విజిలెన్స్ వెనకడుగు వేస్తోందని అన్నారు. దీనివెనుక బలమైన శక్తులు ఉన్నాయా? అని నిలదీశారు. అమాయకులపై చర్య తీసుకోవడానికి ఉత్సాహం చూపుతున్న విజిలెన్స్ అధికారులు.. కార్మికుల రక్తం పీల్చుకు తాగుతున్న జలగలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. సింగరేణి, విజిలెన్స్ కలిసి కారుణ్య నియామకాలు, క్వార్టర్ల కేటాయింపులో జరుగుతున్న అవినీతిని అరికట్టించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎమ్మెల్యేల జోక్యం పెరుగుతోందని ఆందోళన చెందిన నాయకులే ఇప్పుడు వారితో వేదికలు పంచుకుంటున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ ప్రొటోకాల్ తగ్గించి కార్మిక సంఘాలకు ప్రాధాన్యం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు మెండె శ్రీనివాస్, ఆరెపల్లి రాజమౌళి, విజయ్‌కుమార్, దాసరి సురేశ్, సానం రవి, ప్రసాద్, సీహెచ్ రవీందర్‌రెడ్డి, రాంప్రసాద్, రాము పాల్గొన్నారు.

వైభవం.. వెంకన్న కల్యాణం



పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే విజయరమణారావు, సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ హాజరయ్యారు. టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్‌తోపాటు అప్పలయ్య, సందీప్‌రావు, శ్రీకాంత్, దేవనంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాజెక్టుల ప్రదర్శన చేపట్టారు ట్రినిటి, గాయత్రి పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు అబ్బురపర్చాయి. విద్యార్థుల్లో దాగిఉన్న శాస్త్ర, సాంకేతిక నైపుణ్యాలు వెలికితీసేందుకు సైన్స్ ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయన్నారు కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





పెద్దపల్లిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



సుల్తానాబాద్ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పెద్దపల్లిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



గోదావరిఖనిలో సీపీ బందోబస్తు

తొలిరోజు 5,323 మంది హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో బుధవారం ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఫస్టియర్‌లో 5,636 మంది విద్యార్థులకు 5,323 మంది పరీక్షకు హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి కల్పన తెలిపారు. జనరల్ అభ్యర్థులు 4,464 మందికి 4,253 మంది, వొకేషనల్‌లో 1,172మందికి 1,070 మంది పరీక్షకు హాజరయ్యారని వివరించారు. 94.44శాతం హాజరు నమోదైందని పేర్కొన్నారు. పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు.



పెద్దపల్లిలో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థినులు



పెద్దపల్లి పరీక్ష కేంద్రం ఎదుట బారులు తీరిన విద్యార్థులు

లీప్ ఇయర్ అంటే ఏమిటి?

భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365 రోజుల 5గంటల 49 నిమిషాల 12 సెకండ్లు పడుతుందని అంచనా. అంటే 365 రోజులతోపాటు మరో పావు రోజు. పావు రోజును లెక్కలోకి తీసుకోలేం కాబట్టి ప్రతీ నాలుగేళ్లలో నాలుగు పావు రోజుల్ని కలిపితే ఒకరోజు అవుతుంది. దీన్ని చేర్చిన ఇయర్‌నే లీప్ ఇయర్‌గా పిలుస్తాం. ఇలా నాలుగేళ్లకోసారి ఫిబ్రవరి నెలలో 28కి బదులుగా 29 రోజులు వస్తాయి.



లీప్ డే..సందడే

- నాలుగేళ్లకోసారి వచ్చే ఫిబ్రవరి 29 స్పెషల్..
- లీపు సంవత్సరంలో పుట్టిన, వివాహం చేసుకున్నవారిలో సంతోషం
- బర్త్‌డే, మ్యారేజ్ డేకు ఏర్పాట్లు

కోల్‌సిటీ(రామగుండం): సాధారణ సంవత్సరంలో 365 రోజులు, లీపు సంవత్సరంలో 366 రోజులు ఉంటాయి. ఈ ప్రత్యేకమైన ఏడాది మాత్రం ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ ఇయర్ అందరికీ కామన్ అయినా... కొందరికి మాత్రం సమ్‌థింగ్ స్పెషల్. ఫిబ్రవరి 29న పుట్టిన వారిని లీప్లింగ్స్ లేదా లీపర్స్ అని పిలుస్తారు. ప్రపంచంలో ఇలాంటివారు సుమారు 40 కోట్ల మంది ఉన్నారని అంచనా. ఈ రోజున పుట్టినవారు, పెళ్లి చేసుకున్నవారు తమ పుట్టినరోజు, పెళ్లిరోజు వేడుకలు జరుపుకునేందుకు నాలు గేళ్లు ఎదురుచూస్తారు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం లీప్ డే రానే వచ్చింది. బర్త్ డే, మ్యారేజ్ డేను ఘనంగా జరుపుకునేందుకు పలువురు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నేడు లీప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం...

మా కుమారుడి రెండో బర్త్‌డే


నిర్వాన్‌తో తల్లిదండ్రులు ఎల్లేశ్-వనిత

కోల్‌సిటీ: మాది గోదావరిఖని ఎల్బీనగర్. మాకు 2016 ఫిబ్రవరి 29న స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో కుమారుడు జన్మించగా నిర్వాన్ అని పేరు పెట్టాం. లీప్ ఇయర్ కావడంతో నాలుగేళ్ల క్రితం ఫస్ట్ బర్త్ డే చేశాం. గురువారం రెండో బర్త్‌డే చేసేందుకు ఎదురుచూస్తున్నాం.

– నమిండ్ల ఎల్లేశ్-వనిత, గోదావరిఖని

మొదటి పుట్టినరోజు..


శ్రీయన్‌నంద్‌తో తల్లిదండ్రులు మధుకర్-స్రవంతి

కోల్‌సిటీ: మాది రామగిరి మండలంలోని రత్నాపూర్. మాకు 2020 ఫిబ్రవరి 29న కొడుకు పుట్టగా శ్రీయన్‌నంద్ అని పేరు పెట్టాం. నేను జీఎస్టీయాలో, నా భార్య స్రవంతి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తోంది. గురువారం మా కుమారుడి మొదటి పుట్టినరోజు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. చాలా థ్రిల్‌గా ఉంది. 100 మంది నిరుపేద చిన్నారులకు అన్నదానం చేయడానికి హైదరాబాద్‌లోని థాగమ్ ఫౌండేషన్‌కు విరాళం పంపించాం.

– మధుకర్-స్రవంతి

ఎనిమిదో పెళ్లిరోజు..


కుమారుడు, కూతురితో రమేశ్‌బాబు-జ్యోతిలక్ష్మి

ఎలిగేడు(పెద్దపల్లి): మాకు 1992 ఫిబ్రవరి 29 న వివాహమైంది. నేను కిరాణాషాపు నిర్వహిస్తున్న. నా భార్య జ్యోతిలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. కుమారుడు వైభవ్, కూతురు వైష్ణవి ఉన్నారు. మా 32 ఏళ్ల వివాహ జీవితంలో గురువారం ఎనిమిదో పెళ్లిరోజు జరుపుకుంటున్నాం. సంతోషంగా ఉంది.

– రమేశ్‌బాబు-జ్యోతిలక్ష్మి, ఎలిగేడు

నేటితో 64 ఏళ్లు..


భర్త రాజిరెడ్డితో లక్ష్మి

విద్యానగర్(కరీంనగర్): మేము కరీంనగర్‌లోని సప్తగిరికాలనీలో ఉంటాం. నా పుట్టిన రోజు నాలుగేళ్లకోసారి వస్తుందని తెలియదు. మా మనవడు నా స్కూల్ సర్టిఫికెట్లు ఒకసారి చూసినప్పుడు నేను ఫిబ్రవరి 29, 1960న పుట్టినట్లు తెలిసింది. అప్పటి నుంచి కుటుంబసభ్యులందరూ గుర్తుపెట్టుకొని, నాలుగేళ్లకోసారి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఈ గురువారంతో నాకు 64 ఏళ్లు నిండుతాయి. మా ఆయన రాజిరెడ్డి, కుటుంబసభ్యులు వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

– ముస్కుల లక్ష్మి, సప్తగిరికాలనీ, కరీంనగర్

ఈ రోజు మా పెళ్లి..



బోయినపల్లి(చొప్పదండి): ఈ రోజు మా పెళ్లి.. లీప్ ఇయర్ ఫిబ్రవరి 29న దాంపత్య జీవితంలోకి అడుగు పెడుతుండటం ఆనందంగా ఉంది. మా ఇద్దరిదీ ఒకే ఊరు బోయినపల్లి మండలంలోని తడగొండ. నాలుగేళ్లకోసారి పెళ్లిరోజు వస్తుందని తెలిసి, కొత్త అనుభూతి కలుగుతోంది.

– తేజస్రీ-ప్రదీప్‌రెడ్డి, తడగొండ, బోయినపల్లి

మరిచిపోలేనిది..


దువ్వాక మల్లేశం-స్వప్న, రాయికల్

రాయికల్(జగిత్యాల): మాది రాయికల్. మా వివాహం 29-02-2004న జరిగింది. నాలుగేళ్లకోసారి మా పెళ్లిరోజు నిర్వహించుకోవడం జీవితంలో మరిచిపోలేనిది. ఈ రోజు అనాథలకు భోజనం పెడతాం. మా కుమారుడు మల్లికార్జున్, కూతురు తేజస్విని పుట్టిన రోజు కూడా ఇదే నెల 5, 28వ తేదీలు.

ముహూర్తం మళ్లీ రాదని..



తిమ్మాపూర్(మానకొండూర్): మాది తిమ్మాపూర్ మండలంలోని మొగిలిపాలెం. నేను భూపాల్‌పల్లి ఎంఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాను. నాకు సైదాపూర్ మండలంలోని అగ్రహారం కుర్మపల్లి చెందిన మనస్వితో పెళ్లి నిశ్చయమైంది. గురువారం నాటి ముహూర్తం మళ్లీ రాదని పండితులు చెప్పడంతో వివాహం చేసుకుంటున్నాను.

శివరాసన్-మనస్వి, మొగిలిపాలెం, కుర్మపల్లి

అప్పట్లో మాకు తెలియదు..



విద్యానగర్(కరీంనగర్): మా పెళ్లి లీప్ ఇయర్‌లో జరుగుతోందని, నాలుగేళ్లకోసారి పెళ్లిరోజు జరుపుకుంటామని అప్పట్లో మాకు తెలియదు. ఆరోజు మంచి రోజు ఉందని ఫిబ్రవరి 29, 1964న పెద్దలు వివాహం చేశారు. తర్వాత తెలిసింది మా మ్యారేజ్ డే ప్రతీ సంవత్సరం రాదని. మాది సిరిసిల్ల. నేను సిరిసిల్ల శాంతినగర్‌లోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్‌గా జూన్ 2000లో రిటైరయ్యాను. గురువారం మా పెళ్లి రోజు. వివాహమై, 60 ఏళ్లవుతున్న సందర్భంగా మా మనవళ్లు, మనవరాళ్లు షష్టి పూర్తి చేస్తున్నారు.

చిట్నేని శ్రీనివాసరావు-నీరజ, సిరిసిల్ల

36 ఏళ్లు.. తొమ్మిదో పుట్టిన రోజు


కుటుంబసభ్యులతో సందీప్

కోరుట్ల: మాది కోరుట్ల. నేను లీపు సంవత్సరం ఫిబ్రవరి 29, 1988లో జన్మించాను. అప్పటినుంచి ఈరోజు వరకు లెక్కతీస్తే సరిగ్గా తొమ్మిదో పుట్టిన రోజు జరుపుకోబోతున్న. నాన్న లక్ష్మీనారాయణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యారు. అమ్మ స్వరూప. నేను ఎంటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం ముంబయిలో ఉద్యోగం చేస్తున్న. నాలుగేళ్లకోసారి వచ్చే పుట్టినరోజును కుటుంబసభ్యులు, స్నేహితుల మధ్య జరుపుకుంటున్న. ఈసారి అమ్మానాన్న, బంధువులు రెండు రోజుల ముందే నా వద్దకు వచ్చారు.

– తుంగూరి సందీప్‌కుమార్, కోరుట్ల

వయసు 16.. బర్త్‌డే నాలుగోది



గంగాధర(చొప్పదండి): నా వయస్సు 16 ఏళ్లు. బర్త్‌డే మాత్రం నాలుగోదే. మాది గంగాధర మండలంలోని ఉప్పరమల్యాల. నేను 29 ఫిబ్రవరి 2008న జన్మించాను. అందరికన్నా భిన్నంగా నాలుగేళ్లకోసారి జన్మదిన వేడుకలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది.

– దోమకొండ వర్షిణి, ఉప్పరమల్యాల, గంగాధర

మ్యారేజ్ డేకు మస్కట్ నుంచి వస్తా..



కథలాపూర్(వేములవాడ): మాది కథలాపూర్ మండలంలోని చింతకుంట. 2004 ఫిబ్రవరి 29న సంధ్యారాణిని పెళ్లి చేసుకున్న. నేను మస్కట్‌లో ఉంటున్న. నాలుగు సంవత్సరాలకోసారి వచ్చే పెళ్లి రోజును స్వగ్రామం వచ్చి, కుటుంబసభ్యులు, బంధుమిత్రుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది.

– చెదలు ప్రసాద్, చింతకుంట, కథలాపూర్

ఏటా జరుపుకునే చాన్స్ లేదు



అందరూ ఏటా తమ పుట్టిన రోజు జరుపుకుంటారు. కానీ నాకు ఆ చాన్స్ లేదు. నా బర్త్‌డే లీప్ డే కావడంతో ఎదురుచూస్తూ ఉంటా. ఒక్కోసారి అందరిలా ఏడాదికోసారి జరుపుకుంటే బాగుండు అనిపిస్తుంది. కానీ, నాలుగు సంవత్సరాలు వేచిచూడటం ప్రత్యేకం అనుకుంటాను. నేను రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను.

– ఏనుగు రజిత, స్కూల్ అసిస్టెంట్, రాయికల్

నేడు ఏడడుగులు వేస్తున్నాం..


సాయిచంద్-శిశిరూప

గంగాధర(చొప్పదండి): ముహూర్తం కలిసి రావడంతోపాటు ఫిబ్రవరి 29న పెళ్లి చేసుకోవడం ప్రత్యేకంగా ఉంటుందని ఈ రోజు మేము ఏడడుగులు వేస్తున్నాం. మాది గంగాధర మండంలోని ఉప్పరమల్యాల. ఉద్యోగరీత్యా జర్మనీలో ఉంటున్న. హైదరాబాద్‌కు చెందిన శిశిరూపను గురువారం పెళ్లి చేసుకుంటున్న.

– గౌరిశెట్టి సాయిచంద్-శిశిరూప, గంగాధర

అందరికీ ఇన్విటేషన్ ఇచ్చాం..



సప్తగిరికాలనీ(కరీంనగర్): మా వివాహం 2004 ఫిబ్రవరి 29న జరిగింది. మొదటి పెళ్లిరోజు జరుపుకునేందుకు నాలుగేళ్లు పట్టింది. చాలా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నాం. గురువారం ఐదో పెళ్లి రోజు. చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. వేడుకలకు రెడీ అయ్యాం. అందరికీ ఇన్విటేషన్ ఇచ్చాం.

– కోడూరి రజని-సత్యనారాయణ, కోతిరాంపూర్, కరీంనగర్

2020లో అమ్మతో కేక్ కట్ చేశా..



సప్తగిరికాలనీ(కరీంనగర్): మా సొంతూరు వేములవాడ. కానీ, కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాం. ప్రస్తుతం కోతిరాంపూర్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. 1972 ఫిబ్రవరి 29న పుట్టాను. ఇప్పటివరకు 13 సార్లు బర్త్‌డే జరుపుకున్న. 2020లో మా అమ్మతో కలిసి బర్త్ డే కేక్ కట్ చేశా. ఇప్పుడు అమ్మ లేదు. బాధగా ఉంది.

– రాగంపేట చంద్రశేఖర్‌రావు, కరీంనగర్

నేడు ఒక్కటవుతున్నాం..



విద్యానగర్(కరీంనగర్): ఈరోజు మంచి రోజు అని ముహూర్తం నిర్ణయించి, పెళ్లి చేస్తున్నారు. మా ఊరు సుల్తానాబాద్ దగ్గర ముప్పిరితోట. అమ్మాయిది కరీంనగర్. నేను ఛత్తీస్‌గఢ్‌లోని ఎన్టీపీసీలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. మాది పెద్దలు కుదిర్చిన వివాహమే. గురువారం తీగలగుట్టపల్లిలోని రంగినేని గార్డెన్స్‌లో పెళ్లితో ఒక్కటవుతున్నాం.

భరత్‌కుమార్ గౌడ్- కావ్యశ్రీఫణి

నేడు మా వివాహం..


శివాణి-సతీశ్

బోయినపల్లి(చొప్పదండి): అనుకోకుండా లీపు సంవత్సరం ఫిబ్రవరి 29వ తేదీనే మా వివాహం జరుగుతుండటం థ్రిల్లింగ్‌గా ఉంది. మాది గంగాధర మండల కేంద్రం. శివాణిది బోయినపల్లి మండలంలోని దేశాయిపల్లి గ్రామం. మేము మా పెళ్లిరోజును నాలుగేళ్లకోసారి గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాం.

– శివాణి-ఇప్పలపల్లి సతీశ్, దేశాయిపల్లి, గంగాధర

29వ తేదీనే ఎంచుకున్నాం..



కోల్‌సిటీ(రామగుండం): మాది గోదావరిఖని మార్కండేయకాలనీ. ప్రస్తుతం కరీంనగర్‌లో ఉంటున్నాం. నేను గణిత శాస్త్రంలో విద్యార్థులకు శిక్షణనిస్తున్నాను. 1992లో మాధవిని పెళ్లి చేసుకున్న. ఫిబ్రవరి 27, 29 తేదీలు మంచి రోజులని పండితులు చెప్పారు. మేము లీప్ డే అంటే వెరైటీగా ఉంటుందని 29ని ఎంచుకున్నాం. నాలుగేళ్లకోసారి వచ్చే పెళ్లిరోజును సంతోషంగా జరుపుకుంటున్నాం.

– ఆయంచ జవహర్‌బాబు-మాధవి, గోదావరిఖని

మా పాప బర్త్‌డే ప్రత్యేకం


ఆరాధ్యను ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): మాది ధర్మారం మండలం కొత్తూరు. మా కూతురు ఫిబ్రవరి 29న జన్మించింది. నాలుగేళ్లకోసారి బర్త్‌డేను ఘనంగా జరుపుతున్నాం. గురువారం రెండో పుట్టిన రోజు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.

– నెరువట్ల మహేందర్ -శ్రీలత, కొత్తూరు

అందరికీ గుర్తుంటుంది..



కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మాది పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్. నా వివాహం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామానికి చెందిన వడ్లకొండ స్నేహతో నిశ్చయమైంది. పెళ్లి యాధృచ్ఛికంగా గురువారమే నిశ్చమైంది. లీప్ డే కావడంతో మా పెళ్లిరోజు బంధుమిత్రులందరికీ గుర్తుంటుంది.

– గోలి హరీశ్-స్నేహ, కాల్వశ్రీరాంపూర్, చెప్యాల

52వ యేట.. టీనేజ్‌లోకి..


బర్త్‌డే కేక్‌తో రమణకుమార్

మంథని: మాది మంథని. నేను న్యాయవాద వృత్తిలో ఉన్నాను. 1972 ఫిబ్రవరి 29 జన్మించాను. గురువారం 13వ బర్త్‌డే జరుపుకుంటున్న. 52వ యేట.. టీనేజ్‌లోకి అడుగుపెడుతున్నానని సంతోషంగా ఉంది. పుట్టినరోజు వేడుకను కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో జరుపుకుంటా.

– చంద్రుపట్ల రమణకుమార్‌రెడ్డి, మంథని

టైలర్ కార్మికులకు రాయితీ రుణాలివ్వాలి

- మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి చంద్రమౌళి



వేడుకల్లో నాయకులు

పెద్దపల్లిరూరల్: కుట్టుపనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మేరు కులస్తులకు ప్రభుత్వం రాయితీపై రుణాలు మంజూరు చేసి అండగా నిలవాలని మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి చంద్రమౌళి కోరారు. పట్టణంలో బుధవారం టైలర్స్ డే జరుపుకున్నారు. రెడీమేడ్ దుస్తులు అందుబాటులోకి రావడంతో కుట్టుపనికి ప్రాధాన్యత తగ్గిందని ఆందోళన వ్యక్తం చేశారు. కుట్టుపని చేసే కుటుంబాలు దయనీయస్థితిలో ఉన్నాయని ఆవేదన చెందారు. ప్రభుత్వం రాయితీ రుణాలు అందిస్తే రెడిమేడ్‌తోపాటు ఇతర వ్యాపారం చేసుకుంటూ ఆర్థికంగా నిలబడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఈదిశగా చొరవ చూపాలని ఆయన కోరారు. నాయకులు శీలంబాబు, దామోదర్, కీర్తి రాజేశ్, సోమ శ్రీకాంత్, సంతోష్, లక్ష్మణ్, కీర్తి శ్రీను, అడప సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు కల్పించండి

- ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉద్యోగుల విన్నపం



ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమకు ఓటుహక్కు కల్పించాలని ఆర్‌ఎఫ్‌సీఎల్ ఉద్యోగులు కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో భాగంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో పనిచేయాల్సి వస్తోందన్నారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని రామగుండం ఫెర్టిలైజర్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కర్మాగారంలో సుమారు 520 మంది శాశ్వత అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రాలు మారడంతో సుమారు ఏడు సంవత్సరాలుగా తాము ఓటుహక్కు వినియోగించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం చేయడంతో రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికలు, ఒకసారి పార్లమెంట్ ఎన్నికలు, కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోలేకపోయామని అన్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో పనిచేస్తున్న అధికారులు, కార్మికులకు ఓటుహక్కు కల్పించాలని దరఖాస్తు చేసుకున్నా.. అధికారులు అనుమతి ఇవ్వడంలేదని ధ్వజమెత్తారు. ఫెర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్‌లో సుమారు 430 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశాక.. సింగరేణి, ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగులకు కల్పించినట్లు తమకు కూడా అదే తరహాలో ఓటుహక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి ఫెర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్‌లో ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులు కోరారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

మల్లాపూర్: మద్యానికి బానిసైన రత్నాపూర్ గ్రామానికి చెందిన పెడికం వెంకటేశ్ (38) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భద్రాదికొత్తగూడెం జిల్లాకు చెందిన వెంకటేశ్ తొమ్మిదేళ్ల క్రితం భార్య గంగమణితో కలిసి గ్రామానికి వలస వచ్చాడు. మద్యానికి బానిసయ్యాడు. భార్య మందలిస్తున్నా మార్పు రాలేదు. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చాడు. భార్య వారించగా.. ఇకపై మద్యం తాగనని చెప్పి బయటకు వెళ్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్ నిరసనలో జిల్లా నేతలు

మల్లాపూర్: రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి చేపట్టిన నిరసనలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. మోదీ హటావో.. కిసాన్‌కు బచావో నినాదం చేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, ఉపాధ్యక్షుడు దామెర రాజశేఖరెడ్డి, ప్రధాన కార్యదర్శి గజ్జి రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జాతర ఆదాయం రూ.20లక్షలు



సుల్తానాబాద్‌రూరల్: నీరుకుల్ల సమ్మక్క– సారలమ్మ జాతర ఆదాయం రూ.20.13 లక్షలు సమకూరినట్లు ఎండోమెంట్ కార్యనిర్వహణాధికారి శంకరయ్య తెలిపారు.